**92**
**ధారావాహిక**



# జాయ సేనాపతి

**చారిత్రక కాల్పనిక నవల**

మత్తి భానుమూర్తి ...
99893 71284

**జరిగిన కథ : ధనదుప్రోలు కోటలోని సమావేశ మందిరంలోకి.. మండలేశ్వరుడుగా అడుగుపెట్టాడు జాయపుడు. సభాసదులంతా ఉత్సాహంగా లేచి నిలుచుని.. అతనికి ఘనస్వాగతం పలికారు. సంధ్యాకాలపు సాహితీ సమావేశానికి తమ్ముణ్ని ఆహ్వానించాడు పృథ్వీశ్వరచోడుడు. మొదట జాయపుడు అంగీకరించలేదు. కానీ, జాయపుణ్ని చూడాలని.. తనతో సాహితీచర్చలు చేయాలని వెలనాడు రాజ్యపు పండితులు, గ్రంథకర్తలు, కవులు, నాట్య, వాద్యకారులు ముచ్చట పడుతున్నట్లు చెప్పాడు పృథ్వీశ్వరుడు. సాలోచనగా చూశాడు జాయపుడు.**

వాళ్లే కాదు.. మంత్రులు, నియోగాల ఉద్యోగులు, కుటుంబసభ్యులు కూడా అసలు జాయపుని దైనందినం ఏమిటోనని అడగడం.. సమాధానం చెప్పలేక పృథ్వీశ్వరుడు ఏదో సాకు చూపడం జరుగుతూ వస్తున్నది. తమ్ముణ్ని అడిగే ధైర్యం అన్న చెయ్యలేడు. పిల్లలకు నాట్యం నేర్పడానికి అంగీకరించి.. నిత్యమూ పిల్లలతో ఆడిపాడుతూ సంతోషంగా గడుపుతున్న జాయపుణ్ని, ఓరోజు సమయం చూసి.. తనకు పండితవర్గం నుంచి వస్తున్న ఒత్తిడిని ప్రస్తావించాడు. కాస్త మెత్తబడ్డాడు జాయపుడు.

''అన్నా.. నేను పరిపాలనలో కనిపించడం లేదని..'' ఏదో అనబోయాడు.

''అబ్బెబ్బే! ఆ సమస్యరాదు జాయా. మన అయ్య వంశ పాలనను ప్రజలు కోరుకుంటున్నారు కానీ.. పాలకుడు ఎవరు? అన్నా.. తమ్ముడా.. అనేది సాధారణ సమాజానికి అనవసరం..'' అనునయించాడు పృథ్వీ.

ఆ సాయంకాలం వెలనాడు మండలేశ్వరుని నాలుగో సమావేశం తలగడదీవి కోటలో జరిగింది. ద్వీపరాజ్యపు సమస్త కళాప్రపంచం ఆవేళ అక్కడ జాయపుణ్ని చూసి ఆనంద తరంగితమయ్యింది. ధనదుప్రోలు కళాగృహంలోని కవిపండితులు ఎవరైనా ఇక్కడికి వచ్చారేమో.. తనను గుర్తిస్తారేమోనని జాయపుడు మొదట అనుమానాస్పదంగా అంతా కలయజూశాడు. కానీ, తెలిసిన ముఖం ఒక్కటీ కనిపించలేదు. అందరూ పరిచయం చేసుకున్నారు కానీ, ఎవ్వరూ జాయపుణ్ని మరోచోట చూసినట్లు చెప్పలేదు. దాంతో జాయపుడు స్వేచ్ఛగా అందరితో కలుపుగోలుగా సాహితీ సమాలోచనలు చేశాడు.

రాజ్యం గౌరవించిన ఆస్థాన నాట్యాచార్యుడు, ఆస్థాన నర్తకి, ఆస్థాన కవి.. ఇలా అనేకమంది గొప్ప ప్రతిభావంతులైన కవి పండితులు, సాహితీవేత్తలు, గాన, నాట్య, వాద్య మహామహులు ఆరోజు జాయపునితో సంభాషించి పులకించగా.. వారందరితో సాహితీచర్చలు జరిపి జాయపుడు కూడా ప్రపుల్ల మనస్కుడయ్యాడు.

కళాహృదయం పులకించేది, కళ వికసించేది.. సాటి కళాకారుల సమాగమంలోనే!!

అయ్య కుటుంబీకులు.. ముఖ్యంగా పినతండ్రి, అన్న పృథ్వీశ్వరుడు మరింత ఉబ్బితబ్బిబ్బయ్యారు. జాయపుని సాహితీ సమాగమం గురించి అక్క నారాంబకు వెంటనే ఎరుక పరిచాడు పృథ్వీ. వెలనాడులో జాయపుడు ఎలా ఉంటున్నాడోనని అక్క ఎప్పుడూ వేగులతో ప్రశ్నలు పంపుతుంటుంది.

'పాలన వద్దనుకున్నాడు సరే! కాస్త కోట పట్టున ఉండి కోలుకుంటే మాకంటే సంతోషించేవారు ఎవరు పృథ్వీ!? జాయపుడు వీధులవెంట తిరగడం బావగారికి ఇష్టమే కానీ, నాకు మాత్రం చిరాకురా పృథ్వీ. వాణ్ని కోటలో ప్రశాంతంగా ఉంచాలి. ముఖ్యవిషయం ఒకటి చెప్తా గుర్తుపెట్టుకో. వాడివద్ద పెళ్లి ప్రసక్తి మాత్రం తేవద్దు.